విద్యుత్తు సామగ్రి నో స్టాక్

- దక్షిణ డిస్కం స్టోర్స్‌లో విద్యుత్ సామగ్రి కొరత
- కేబుల్స్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు నో స్టాక్
- డీడీలు కట్టినా కాంట్రాక్టర్లకు అందని సామగ్రి
- వేసవిలో సరఫరా సమస్యలు తప్పవంటున్న అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ సర్కిల్‌కు చెందిన ఓ విద్యుత్తు కాంట్రాక్టర్ నిరుడు ఆగస్టులో 11 కేవీ సీటీపీటీ సెట్, 11 కేవీ హెచ్‌టీ టీవీఎం 20/5ఏ కోసం రూ.8 లక్షలు డీడీ చెల్లించారు. కానీ ఇప్పటికీ విద్యుత్ పరికరాలు సరఫరా కాలేదు. ఉప్పల్‌కు చెందిన మరో కాంట్రాక్టర్ ఎల్‌టీఎస్ ఎల్‌పీఈ కేబుల్ 1 కోర్ 120 స్క్వేర్ ఎంఎంతో పాటు 10 రకాల పరికరాలకు జూలైలో డీడీ కట్టారు. కానీ సామగ్రి అందలేదు. అధికారులను అడిగితే డిస్కం స్టోర్స్‌లో పరికరాలు లేవని చేతులెత్తేస్తున్నారు. ఇలా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని విద్యుత్తుశాఖ స్టోర్స్‌లో నో స్టాక్ అంటూ అధికారులు చెప్తుండడంతో కాంట్రాక్టర్లు, వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. డబ్బులు చెల్లించి నెలలు గడుస్తున్నా సామగ్రి రాకపోవడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దక్షిణ డిస్కంకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సుమారు 60 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. నెలనెలా శివారు ప్రాంతాల్లో వినియోగదారులు పెరుగుతున్నారు. వీరికి విద్యుత్తు కనెక్షన్లు, సరఫరాకు అవసరమైన సామగ్రిని దక్షిణ డిస్కం సరఫరా చేయలేకపోతున్నది. అరకొరగా ఉన్న సామగ్రిని అడ్డదారిలో లంచాలు ఇచ్చిన వారికి, ప్రజాప్రతినిధుల రికమండేషన్ తెచ్చిన వాళ్లకు సరఫరా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నెలలు గడిచినా సరఫరా లేదు!

కొత్త ఇండ్లు, కమర్షియల్ కాంప్లెక్సులు కరెంటు కనెక్షన్ తీసుకోవాలన్నా, ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టుకోవాలన్నా, విద్యుత్తు శాఖకు దరఖాస్తు చేసుకోవాలి. శివారు ప్రాంతాల్లోని పరిశ్రమలు, వాణిజ్య కేంద్రాల బహుళ అంతస్తులకు విద్యుత్తు పనులను ప్రైవేటు కాంట్రాక్టర్లు నిర్వహిస్తుంటారు. విద్యుత్తుశాఖ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనాలు సిద్ధం చేస్తారు. ఈ మేరకు దక్షిణ డిస్కంకు డీడీలు చెల్లిస్తే సామగ్రి ఇస్తుంది. ఏడాది క్రితం 10 రోజుల్లోనే సామగ్రి సరఫరా అయ్యేదని, కానీ ప్రస్తుతం ఈ ప్రక్రియ డీడీల చెల్లింపు దశను దాటడంలేదని కాంట్రాక్టర్లు, వినియోగదారులు వాపోతున్నారు. ప్రైవేటు మార్కెట్‌లోనూ సామగ్రి దొరుకుకుంది. కానీ నాణ్యమైన సామగ్రి తామే సరఫరా చేస్తామంటూ డిస్కంలు చెప్తున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా పర్చేజింగ్ అండ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగం ఏర్పాటు చేసింది.

వేసవిలో తీవ్ర ప్రభావం!

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజుకు 5వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం జరుగుతుందని అధికారులు చెప్తున్నారు. వేసవిలో వినియోగం పెరుగుతుంది. అందుకు తగ్గట్టుగా డిస్కంల సమ్మర్ ప్లాన్ చేసుకోవాలి. సామగ్రి కోసం టెండర్లు ఖరారు చేసుకోవాలి. కానీ డిస్కంలు పట్టించుకోవడం లేదని, ఓవర్‌లోడ్‌ను ఎలా తట్టుకోవాలని కాంట్రాక్టర్లు, వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. డీడీలు తీసుకుని డిస్కం అధికారులు చోద్యం చూస్తున్నదని మండిపడుతున్నారు. ఒక ఫీడర్ నుంచి కరెంట్ ఇచ్చి, మరొక వైపు సరఫరా బంద్ చేయాల్సిన పరిస్థితి వస్తున్నదని, ఇదే పరిస్థితి కొనసాగితే ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్తు నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు తప్పవని అధికారులు వాపోతున్నారు.

విక్రయానికి హౌసింగ్‌బోర్డ్ ఆస్తులు!

- భూములు, దుకాణాలు అమ్మేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు
- 'దిల్' భూములపై కూడా కన్ను దిల్ భూములను నాడు ప్రభుత్వపరం చేసిన కేసీఆర్
- నేడు అమ్మకానికి పెట్టే యోచనలో రేవంత్ సర్కార్
- నిధుల సమీకరణకు ఎత్తుగడలు

హైదరాబాద్, జనవరి 26(నమస్తే తెలంగాణ): అత్యంత విలువైన హౌసింగ్‌బోర్డు ఆస్తులను విక్రయించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నదా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. సంక్షేమ పథకాల అమలు కోసం బ్యాంకుల నుంచి తెస్తున్న రుణాలు సరిపోకపోవడంతో విలువైన భూములను విక్రయించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి. హౌసింగ్‌బోర్డుకు చెందిన దాదాపు 600 ఎకరాల భూమి, సుమారు 300 దుకాణాలు విక్రయించే జాబితాలో ఉన్నట్టు తెలిసింది. వీటితోపాటు దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ హోల్డింగ్స్ లిమిటెడ్ (దిల్) నుంచి ప్రభుత్వం వాపసు తీసుకున్న ఐదువేల ఎకరాలను కూడా విక్రయించాలని యోచిస్తున్నట్టు సమాచారం. భూముల విక్రయానికి సంబంధించి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించే పనిలో ఉన్నట్టు తెలిసింది.

వైఎస్ హయాంలో హౌసింగ్‌బోర్డు నిర్వీర్యం

పేద, మధ్య తరగతి వర్గాల కోసం హౌసింగ్ కాలనీలు అభివృద్ధిచేసి సరసమైన ధరలకు వాటిని విక్రయించే ఉద్దేశంతో ఏర్పాటైన హౌసింగ్‌బోర్డు.. కాలక్రమంలో తమ ఉనికి కోల్పోయింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో హౌసింగ్ కార్పొరేషన్, గృహకల్పను ఏర్పాటుచేయడంతో హౌసింగ్‌బోర్డు అలంకారప్రాయంగా మారింది. పేదల కోసం ఉచితంగా అందించే గృహాల నిర్మాణం కోసం హౌసింగ్ కార్పొరేషన్‌ను, మధ్యతరగతి వర్గాల కోసం గృహకల్పను ఏర్పాటుచేశారు. దీంతో ప్రస్తుతం కేపీహెచ్‌బీ, అమీర్‌పేట, ఈసీఐఎల్, మౌలాలీ తదితర అనేక ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన కాలనీలు హౌసింగ్‌బోర్డుకు గుర్తులుగా మిగిలాయి. హౌసింగ్‌బోర్డుకు సంబంధించి హైదరాబాద్‌తోపాటు దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో 4,609 ఎకరాలు ఉండగా, అందులో 3,820 ఎకరాల్లో ఇదివరకే కాలనీలు నిర్మించారు. మిగిలిన 789 ఎకరాల్లో దాదాపు 80 ఎకరాలపై కోర్టులో కేసులు ఉండగా, 610 ఎకరాలు క్లియర్‌గా ఉన్నది. ఇవికాకుండా 150 ఎకరాల భూమి లీజులకు ఇచ్చారు. ఇందులో సుమారు 100 ఎకరాలు జేఎన్‌టీయూకి, మిగిలింది వివిధ సంస్థలు, వ్యక్తులకు ఇచ్చారు. ఇందులో కొన్ని భూములపై కోర్టులో వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా నిధుల సమీకరణలో నిమగ్నమైన రాష్ట్ర సర్కారు దృష్టి హౌసింగ్ బోర్డు ఆస్తులపై పడింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆస్తుల వివరాలు, ప్రస్తుతం వాటి స్థితి తదితర వివరాలతో కూడిన నివేదికను అధికారులు ఇటీవలే ప్రభుత్వానికి అందించారు. భూముల ధరలు, నిర్మాణ ఖర్చులు భారీగా పెరగడంతోపాటు రాజీవ్ గృహకల్ప ఇండ్లలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత ప్రభుత్వం ఇండ్లను నిర్మించి విక్రయించడం కన్నా భూములను విక్రయించడానికే మొగ్గు చూపుతున్నదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

300 దుకాణాలు సైతం విక్రయానికి

హౌసింగ్‌బోర్డుకు సంబంధించి హైదరాబాద్‌లోని ఎంజేరోడ్, మహబూబ్‌గంజ్, బషీర్‌పల్లి, విజ్ఞాన్‌పురి, వెంగళరావునగర్, బర్కత్‌పుర తదితర ప్రాంతాల్లో 300 దుకాణాలు ఉండగా, అనేక ఏండ్లుగా అద్దెల సవరణ జరగకపోవడంతో వాటిపై నామమాత్రంగా ఆదాయం వస్తున్నది. దీంతో ఉమ్మడి రాష్ట్రంలో 2005లో అప్పటి ప్రభుత్వం ఈ దుకాణాలను విక్రయించాలని నిర్ణయించి ఉత్తర్వులు జారీచేసింది. అప్పటి మార్కెట్ విలువ ప్రకారం 11 దుకాణాలను విక్రయించగా, వివిధ కారణాలతో మిగిలిన దుకాణాల విక్రయం నిలిచిపోయింది. ఎలాగూ వీటిపై పెద్దగా ఆదాయం రావడంలేదు కాబట్టి భూములతోపాటు వీటిని కూడా విక్రయించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిసింది. వీటితోపాటు హౌసింగ్‌బోర్డుకు సంబంధించి గృహకల్ప, గగన్‌విహార్, చంద్రవిహార్, ఇన్పర్మేషన్ కమిషనర్ ఆఫీసు, మనోరంజన్ కాంప్లెక్స్, తుల్జాగూడ కాంప్లెక్స్, ఎస్ఆర్‌నగర్ కాంప్లెక్స్ తదితర భారీ షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వీటిని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలకు అద్దెలకు ఇచ్చారు. వీటిపై ప్రస్తుతం నెలకు రూ.మూడు కోట్లవరకూ అద్దెలు వస్తుండగా, అవి ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతున్నాయి. ఇందులో ఎక్కువ శాతం ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు ఉండటంతో క్రమం తప్పకుండా అద్దెలు వస్తుండటంతో ఉద్యోగుల జీతభత్యాలకు లోటు లేకుండా ఉన్నది. అయితే, ఇందులోనూ కొందరు దుకాణదారులు కోర్టులో కేసులు వేసి అద్దెలు ఇవ్వడంలేదని ఉద్యోగులు చెప్తున్నారు.

దిల్ భూములకూ రెక్కలు

కంపెనీస్ చట్టం కింద 2007లో దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ హోల్డింగ్స్ లిమిటెడ్ (దిల్-డీఐఎల్ఎల్)ను అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. సమీకృత టౌన్‌షిప్‌ల నిర్మాణం, పీపీపీ కింద జాయింట్ వెంచర్ ప్రాజెక్టులు చేపట్టే ఉద్దేశంతో దీనిని ఏర్పాటుచేశారు. దిల్ కింద తెలంగాణలోని ఆరు జిల్లాల్లో 6,800 ఎకరాల భూములు, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణంలో 150 ఎకరాల భూములు ఉండేవి. అందులో 1,890 ఎకరాలను వివిధ ప్రాజెక్టుల కోసం వినియోగించడమో, విక్రయించడమో జరగగా, 5000 ఎకరాలు దిల్ ఆధీనంలో ఉండేవి. ఈ భూములను టీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో జీవో ద్వారా వెనక్కు తీసుకున్నది. ఈ భూములను కూడా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయానికొచ్చినట్టు తెలిసింది. దిల్ నుంచి తెలంగాణ సర్కారు వాపసు తీసుకున్న 5000 ఎకరాల భూముల విలువ రూ.70వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా.

నకిలీ డాక్యుమెంట్లతో టోకరా

- బాధితులు భూమిలోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం
- అడ్డుకొని స్టేషన్లకు తరలించిన పోలీసులు

మన్సూరాబాద్, జనవరి 26 : నకిలీ డాక్యుమెంట్లతో అటవీ భూమిని అంటగట్టిన ముఠా మోసం వెలుగులోకి వచ్చింది. మన్సూరాబాద్ సర్వే నంబర్-7లోని అటవీ శాఖకు చెందిన భూమి పూర్వీకుల నుంచి తమకు సంక్రమించిందంటూ యూనిస్‌ఖాన్, ఆయన భార్య వాసం తులసమ్మ అలియాస్ సుల్తానా.. అడ్వకేట్ మహ్మద్ జిలానీతో కలిసి సుమారు 300 మందిని మోసం చేసి నకిలీ డాక్యుమెంట్లతో ప్లాట్లను విక్రయించారు. మోసకారుల మాటలు నమ్మిన బాధితులు అప్పులు చేసి ప్లాట్లు కొనుగోలు చేశారు. ఆ తర్వాత అటవీశాఖకు చెందిన భూమిని అంటగట్టారని తెలుసుకున్నారు. తమ వద్ద ప్లాట్లు కొనుగోలు చేసిన వారంతా రిపబ్లిక్ డే రోజున సదరు భూమి వద్దకు రావాలని, అక్కడ జెండా ఎగురవేసి ప్లాట్లను స్వాధీనం చేసుకుందామని మహ్మద్ జిలానీ ప్రచారం చేశాడు. సుమారు 200 మంది ఆదివారం ఉదయం మన్సూరాబాద్ నుంచి ఆటోనగర్ డంపింగ్ యార్డుకు వెళ్లే మార్గంలోకి చేరుకున్నారు. విషయం తెలిసి అక్కడి చేరుకున్న వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, హరిణ వనస్థలి నేషనల్ పార్కు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సాయిప్రకాశ్ బాధితులతో మాట్లాడారు. సర్వే నంబర్-7లో 582 ఎకరాల భూమి అటవీశాఖ ఆధీనంలో ఉందని, సదరు భూమి లో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు తీసుకుని.. యూనిస్‌ఖాన్, సుల్తానా, మహ్మద్ జిలానీ అమ్మకాలు జరిపినట్టు బాధితులు వాపోయారు. సదరు భూమిలో జెండా ఎగురవేసేందుకు ప్రయత్నించగా ఎల్బీనగర్ అడిషనల్ డీసీపీ నేతృత్వంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. అదుపులోకి తీసుకుని ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

కిడ్నీ రాకెట్‌లో కీలక సర్జన్ అరెస్ట్

- దవాఖానల్లో అర్గాన్ మాఫియా ఇన్ఫార్మర్లు!
- బ్రెయిన్‌డెడ్ కేసుల వివరాలు ముఠాకు చేరవేత
- బడా దవాఖానలతో మాఫియాకు సంబంధం
- ఫిర్యాదుకు తడబడ్డ అధికారులపైనా సందేహం?
- ఆర్గాన్ మాఫియాపై పోలీసు ముమ్మర దర్యాప్తు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 26 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సరూర్‌నగర్ అలకనంద దవాఖానలో బయటపడ్డ కిడ్నీ దందా కేసులో అరెస్టయిన నిందితుల సంఖ్య 10కి చేరింది. కిడ్నీ మాఫియాలో చక్రం తిప్పుతున్న వైద్యుడు రాజశేఖర్‌ను ఆదివారం చెన్నైలో రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ముఠాలో అతడే కీలక సర్జన్‌గా భావిస్తున్నారు. కేసులో మరో కీలక నిందితుడు పవన్ కోసం గాలిస్తున్నారు. నిందితుల సమాచారం ప్రకారం కిడ్నీ రాకెట్ నెట్‌వర్క్ మొత్తాన్ని పవన్ నడిపించినట్టు తెలుస్తున్నది. ముఠాకు జమ్మూ కశ్మీర్, తమిళనాడు, కర్ణాటక వైద్యులతో, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలోని దవాఖానలతో సంబంధాలున్నాయని పోలీసులు భావిస్తున్నారు. సెల్‌ఫోన్లలోని డాటా రీస్టోర్‌కు ప్రయత్నిస్తున్నారు.

ముఠాకు భారీ నెట్‌వర్క్

కిడ్నీల అక్రమ మార్పిడి కేసులో పోలీసుల దర్యాప్తులో నివ్వెరపోయే విషయాలు బయటపడుతున్నాయి. నగరంలో కిడ్నీ మాఫియాతో పాటు, ఇతర అవయవాల అక్రమ రవాణా కూడా నడుస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కిడ్నీ రాకెట్ కేసు నిందితుల విచారణలో ఈ విషయాలు గుర్తించినట్టు తెలుస్తున్నది. చాలా దవాఖానల్లో మాఫియాకు ఇన్ఫార్మర్లు ఉన్నారని, జీవన్‌దాన్ డాటాతో పాటు బ్రెయిన్‌డెడ్ పేషెంట్ల సమాచారం మాఫియాకు చేరిపోతున్నట్టు సమాచారం.

అక్రమార్కుల వేటలో పోలీసులు ఫిర్యాదుకు తడబాటు ఎందుకో?

ఈ నెల 21న అలకనంద దవాఖానలో కిడ్నీ అక్రమ మార్పిడిపై సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. పోలీసులే వైద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రాత్రి 10.30 గంటలకు వైద్యాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారులు పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడానికి ఎందుకు తర్జనభర్జన పడ్డారని పోలీసువర్గాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాజడి

యూపీఎస్ వచ్చేస్తోంది..

ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) అమలును మోదీ సర్కారు ప్రకటించింది. పదవీ విరమణ పొందినవారికి పింఛన్ హామీ, ఆర్థిక భద్రతలే లక్ష్యంగా పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్), జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) రెండింటి ప్రయోజనాలను కలగలిపి ఈ యూపీఎస్‌ను కేంద్రం తీసుకొచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానున్నది. అయితే అర్హులైనవారికి ఈ యూపీఎస్ ఎలాంటి పరిస్థితుల్లో వర్తిస్తుందో కూడా ఇందులో పేర్కొన్నారు.

పదవీ విరమణ

కనీసం పదేండ్లు ఎంపిక చేసిన సేవలు అందించి, ఆ తర్వాత రిటైరైన ఉద్యోగులకు యూపీఎస్ వర్తిస్తుంది.

ఎఫ్ఆర్ 56(జే) కింద రిటైర్మెంట్

పెనాల్టీ ప్రొవిజన్స్ కింద కాకుండా రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులే అర్హులు.

వాలంటరీ రిటైర్మెంట్

కనీసం 25 ఏండ్లు పనిచేసి, ఆ తర్వాత స్వచ్ఛంధ పదవీ విరమణ తీసుకున్నవారికి రిటైర్మెంట్ వయసు వచ్చాకే పింఛన్.

ఇలాగైతే రాదు..

డిస్మిస్, ఉద్యోగం నుంచి తొలగించిన వారు, రాజీనామా చేసినవారికి యూపీఎస్‌ను ఎంచుకొనే అవకాశం ఉండదు.

యూపీఎస్ ప్రయోజనాలు

- 25 ఏండ్లు లేదా అంతకుమించి క్వాలిఫైయింగ్ సర్వీస్ ఉన్న ఉద్యోగులకు రిటైర్మెంట్‌కు ముందు చివరి 12 నెలలు అందుకున్న వేతనంలోని సగటు బేసిక్ పేలో 50 శాతాన్ని నెలనెలా పింఛన్‌గా అందిస్తారు. సర్వీస్ 25 ఏండ్ల కంటే తక్కువగా ఉంటే పింఛన్ తగ్గుతుంది.
- క్వాలిఫైయింగ్ సర్వీస్‌లో 10 ఏండ్లు, అంతకుమించి ఉన్న ఉద్యోగులకు నెలకు కనీసం రూ.10,000 పింఛన్‌గా చెల్లిస్తారు. 25 ఏండ్లు పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నవారికి, పదవీ విరమణ వయసు వచ్చాకే పింఛన్ మొదలవుతుంది.
- పదవీ విరమణ అనంతరం పింఛన్‌దారుడు చనిపోతే.. ఆ పింఛన్‌లో 60 శాతం భార్య లేదా భర్తకి వస్తుంది.
- నిబంధనలకు లోబడి ఉద్యోగులకు డీఏ తరహాలోనే పింఛన్‌దారుడు, వారు లేకపోతే భాగస్వామికి డియర్‌నెస్ రిలీఫ్‌నూ చెల్లిస్తారు. పింఛన్ మొదలైతేనే వస్తుంది.
- అదనంగా పదవీ విరమణ సమయంలో క్వాలిఫైయింగ్ సర్వీస్‌లోని ప్రతీ ఆరు నెలల కాలానికి నెలవారీ బేసిక్ పే, డీఏలో 10 శాతం చొప్పున లెక్కించి ఎన్నేండ్లయితే అన్నేండ్లకు ఒకేసారి చెల్లిస్తారు. ఈ మొత్తం పింఛన్‌లో తగ్గించరు.

ఇలా ట్రై చేద్దామా..!

లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండే

దేశీయంగా బంగారం ధరలు మళ్లీ ఆల్‌టైమ్ హైల్లో కదలాడుతున్నాయి. మొన్నటిదాకా తగ్గుముఖం పడుతున్నట్టు కనిపించినా.. తిరిగి పుంజుకున్నాయి. దీంతో చాలా మంది అవసరమైతే తప్ప పసిడి కొనుగోళ్లకు వెళ్లడం లేదు. ఇంకొందరైతే రేట్లు మరింత తగ్గుతాయేమోనని ఎదురుచూస్తూ ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాముల విలువ మునుపెన్నడూ లేనివిధంగా రూ.83,000 దాటేసింది మరి. అయితే సరిగ్గా ఇప్పుడే లో క్యారెట్ గోల్డ్.. కొనుగోలుదారులకు చక్కని ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నది. 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత), 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత)లే కాకుండా 18, 14, 10 క్యారెట్ బంగారు ఆభరణాలు కూడా దొరుకుతాయి. నిజానికి ఇప్పుడిప్పుడే ఈ లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండ్ కనిపిస్తుండటం మార్కెట్‌లో మారిన ట్రెండ్‌కు నిదర్శనం.

బడ్జెట్‌కు తగ్గట్టుగా..

కొనుగోలుదారుల అభిరుచికి తగ్గట్టుగా ఇటీవలికాలంలో బడా జ్యుయెల్లర్స్, ప్రముఖ నగల వర్తకులు సైతం 18 క్యారెట్ బంగారు ఆభరణాలను పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారు. మరికొన్ని చిన్నచిన్న జ్యుయెల్లర్స్ 14, 10 క్యారెట్ బంగారు నగలనూ తెస్తున్నారు. పైగా భారతీయ మార్కెట్‌లో మెజారిటీ వాటా మిడిల్ క్లాస్ కస్టమర్లదే కావడంతో జ్యుయెల్లర్స్ దృష్టీ ఈ లో క్యారెట్ విభాగంపై గట్టిగానే పడుతున్నది. ఇక వీటిలోనూ నచ్చిన, రకరకాల డిజైన్లు ఇప్పుడు లభిస్తుండటం విశేషం. దీంతో ఎగువ మధ్యతరగతి నుంచి దిగువ మధ్యతరగతి వర్గాలదాకా అంతా వీటి కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా యువత కూడా మక్కువ చూపుతున్నది. అలాగే ధర తక్కువ కావడం, ఆకర్షణీయంగా కూడా ఉండటంతో మార్కెట్‌లో వీటికి నానాటికీ డిమాండ్ పెరుగుతూపోతున్నది. అందరి బడ్జెట్‌కు తగ్గట్టుగా అందుబాటులో ఉంటుండటంతో పెండ్లిళ్లు, ఇతర శుభకార్యాలకూ ఎక్కువగా వీటినే ఎంచుకుంటుండటం ఈ మధ్యకాలంలో పెరిగిందనే చెప్పవచ్చు.

నాణ్యతకు ఢోకా లేదు

22 క్యారెట్ నుంచి 10 క్యారెట్ వరకు ఆయా ఆభరణాల్లో బంగారం వినియోగం తగ్గుతున్నకొద్దీ వెండి, రాగి, జింక్, నికెల్, పల్లాడియం తదితర లోహాల వాటా పెరుగుతుంది. అందుకే వాటి ధరల్లో అంత తేడా. 22 క్యారెట్ బంగారు ఆభరణాల్లో బంగారం వాటా ఎక్కువగా ఉంటుంది కనుక సహజంగా వీటి రేటు అధికం. 24 క్యారెట్ గోల్డ్ రేటుకు దగ్గర్లోనే పలుకుతుంది. నిజానికి స్వచ్ఛమైన బంగారంతో నగలను తయారు చేయలేం. అందుకే వాటిలో ఇతర లోహాలను కొద్దిగానైనా కలుపుతారు. ఇదే క్రమంలో గోల్డ్ క్యారెట్ తగ్గుతున్నకొద్దీ ఇతర లోహాల పరిమాణం పెరుగుతూపోతుంది. అంతమాత్రం చేత నాణ్యతకు ఢోకా ఉండదు. ఇంకా చెప్పాలంటే 22 క్యారెట్ కంటే 18 క్యారెట్ బంగారు ఆభరణాలే గట్టిగా ఉన్నాయని వినియోగదారులు చెప్పుండటం గమనార్హం.

చివరగా..

ధరలు పెరిగాయనో.. డబ్బు సరిపడా లేదనో కాకుండా మీ బడ్జెట్‌లో ఆయా రకాలలో క్యారెట్ నగలను ఆనందంగా కొనేయండి. అయితే మోసాలకు తావు లేకుండా జాగ్రత్తపడటం మాత్రం మరిచిపోవద్దు. అన్ని నాణ్యతా ప్రమాణాలు ఉన్నాయా? లేదా? అన్నది కనుక్కోవడం మంచిది. ఇక వీటిని మళ్లీ అమ్ముకున్నా.. తరుగుపోను అందులోని బంగారానికి అప్పటి రేటు ఎలాగూ లభిస్తుంది. ధర తక్కువైతే అప్పుడు మరింత హై క్యారెట్ బంగారు నగలకు అప్‌గ్రేడ్ అయిపోండి.

రెండేండ్ల క్రితం దేశీయంగా నగల అమ్మకాల్లో 5 నుంచి 7 శాతంగా ఉన్న లో క్యారెట్ గోల్డ్ ఆర్నమెంట్స్ వాటా.. ఇప్పుడు 15% దాటిపోవడం మారిన ట్రెండ్‌కు అద్దం పడుతున్నది.

-సురేంద్ర మెహెతా, భారతీయ బులియన్, జ్యుయెల్లర్స్ సంఘం కార్యదర్శి

తేలికపాటి నగల హవా

ఒకప్పుడు నడుములు వంగిపోయేంతదాకా నగలు ధరించేవారు. భారీ డిజైన్లతో.. తులాలకొద్దీ బంగారాన్ని పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు అంతంత బరువైన నగలను వేసుకొనేందుకు సంపన్నులు సైతం ఇష్టపడటం లేదు. దీంతో మార్కెట్‌లో తేలికపాటి బంగారు నగలకే ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉంటున్నదని నగల వ్యాపారులు అంటున్నారు. నగల తయారీలో వచ్చిన కొత్త టెక్నాలజీ.. సంప్రదాయ, భారీ డిజైన్లనూ తక్కువ బంగారాన్ని వినియోగించి స్వల్ప బరువుకే అందుబాటులోకి తెచ్చేలా చేసిందని ప్రపంచ స్వర్ణ మండలి భారతీయ కార్యకలాపాల విభాగం సీఈవో సచిన్ జైన్ చెప్తున్నారు. మొత్తానికి లైట్ వెయిట్.. లో క్యారెట్ గోల్డ్ ఇప్పుడు పసిడి మార్కెట్‌ను శాసిస్తున్నాయనడంలో సందేహం లేదు.

ఇదీ క్యారెట్ కథ..

- 24 క్యారెట్‌లో 99.90 శాతం స్వచ్ఛమైన పుత్తడి ఉంటుంది. దీన్నే మేలిమి బంగారంగా కూడా పిలుస్తారు. కడ్డీలు, బిస్కట్లు, నాణేల రూపంలో అమ్ముతారు.
- 22 క్యారెట్‌లో 91.67 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి లభిస్తుంది. మిగతా 8.33 శాతం (5 శాతం వెండి, 2 శాతం రాగి, 1.33 శాతం జింక్) ఇతర లోహాల మిశ్రమం ఉంటుంది. అత్యుత్తమ శ్రేణి నగల తయారీకి దీన్నే వాడుతారు.
- 18 క్యారెట్‌లో 75 శాతం ప్యూర్ గోల్డ్ కనిపిస్తుంది. 25 శాతం ఇతర లోహాలే.
- 14 క్యారెట్‌లో 58.33 శాతం స్వచ్ఛమైన బంగారం. 41.67 శాతం వేర్వేరు లోహాలను కలుపుతారు.
- 10 క్యారెట్‌లో 41.67 శాతం బంగారం, 58.33 శాతం ఇతర లోహాలు.



సూచీలకు బడ్జెటే దిక్సూచి

దేశీయ స్టాక్ మార్కెట్లు రివర్స్‌గేర్‌లోనే నడుస్తున్నాయి. గత వారంలోనూ నిరాశపర్చాయి. ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడిలో ఉండిపోతున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 428.87 పాయింట్లు లేదా 0.55 శాతం దిగజారి 76,190.46 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 111 పాయింట్లు లేదా 0.47 శాతం క్షీణించి 23,092.20 దగ్గర ఆగింది. అయితే ఈ వారం బడ్జెట్ అంచనాలు, నిర్ణయాలు.. మార్కెట్లకు దిక్సూచిగా ఉండనున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఇది శనివారమైనప్పటికీ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ జరుగనున్నది. సాధారణంగా శని, ఆదివారాలు స్టాక్ మార్కెట్లకు సెలవు అన్న విషయం తెలిసిందే. దీంతో బడ్జెట్‌ను ఇన్వెస్టర్లు మెచ్చితే సూచీలు పైకి, లేకుంటే కిందికి అనుకోవచ్చు. ప్రధానంగా ఆయా రంగాల షేర్లను పన్నులు, ప్రోత్సాహకాలు నడిపిస్తాయని చెప్పవచ్చు. ఆదాయ పన్నుల్లో ఊరట లభిస్తే ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ షేర్లకు ఊతమిచ్